కథ :

# "తాగుడొద్దు - తన్నులాటలొద్దు"

గోపాలు

గుడుంబా వాసనతో ఊరంత గుప్పుమంటోంది. సగంమంది సప్పాలు చేరింత లతో ఉంటే సగంమంది అడివిలో పొద్దుగూకినట్లుగా అగం అగంగా చిరాకుగా ఉన్నారు.

ఊళ్ళో కరంటు బుగ్గలెలిగాయి. దోమలు గుంపులకు గుంపులుగా మోత్ పెడుతూ తిరుగుతున్నాయి. సాయంత్రం వంటపనిలో ఆడవాళ్ళు, ఏడిచే పిల్లల కసురుతూ, తాగుబోతు భర్తలను తిడుతూ వడ్లు దంచుతూనో, బియ్యం చెరుగుతూనో, విసుర్రాళ్ళ విసురుతూనో ఉన్నారు. పురుషులు చాలామంది స్నానాలు చేసి పొడి బట్టలు కట్టుకొని బజార్లల్లో అక్కడికక్కడికి తిరుగుతున్నారు. చిమ్మెట్లు అదే పనిగా పలుకుతున్నాయి.

అలాంటి మునిమాపు సమయంలో దాసరి ముత్యాలు వాకిట్లో పీకిపోయిన చూరుకింద పదిమంది కూర్చున్నారు. వాళ్ళ ముందు సీసాలల్లో గుడుంబ ఉన్నది. గాజుగ్లాసులున్నాయి. అప్పుడే పెంటమ్మ తాళంవేసిన పెనగ గుడాలు తెచ్చి తలో కొన్ని కొలిచిపెట్టి డబ్బు తీసుకొని వెళ్ళిపోయింది.

"ఓ పెద్దనాయిన ఇగోన పాపేసుకోవే" గాదె పాపయ్య బలవంతంగా చిన్న గ్లాసులో గుడుంబ తెచ్చియిచ్చాడు.

"ఔరా! తెల్లందాకా పొద్దందాకా గిది తాక్కుంట దిగ్గుదేనా? కాస్తేత ఇద్దరు పొల్లగండ్లు కోడలును తీసుకచ్చుకోవునా?" పెద్దనాయిన బొక్కి నోటితో బోసుగూపి నట్టుగా అన్నాడు.

---

ఇక్కడ అర్థంలేని పద్యాలెందుకు చదువుతావు ?
ఇది నినాదాలివ్వవలసిన వేళ !
నువు ఇప్పుడు కాశ్మీర్‌లో ఉన్నావు.
ఇంకా అమెరికా గురించి మాట్లాడతావా ?
పాతకాలపు రుద్రాక్షమాల ధరించిన నువ్వు
ఆధునికుణ్ణని చెప్పుకోవడం ఎంత చిత్రం !

వాళ్ళకు కొంచెం దూరంలో చింతకింద కూర్చున్న పాపయ్య మిత్రబృందంలో నుండి ఒకడు, "మావ మనిషిబల్మ శాశ్వతం గాదు" అన్నాడు.

అతని పక్కవాళ్ళు అకారణంగా నవ్వారు.

"పోనియ్యే. మూడెకరాల పొలంబోయింది. రెండెకరాల పెరడిబోయింది. పేట సేసినోడెవ్వడు బాగుపడ్డడు" పాపయ్య.

"అన్నలేమో కొట్టు కెట్టి చెప్పవట్టిరి. మనోళ్లె ఎనుబై ఎకరాలు దున్నితిరి." సుక్కపోశాలు ....

"గిప్పుడే మాకు మాట దొరుత్తలేదు. అయింక గుద్దుకునుడే-అనేముత్తాలు" పల్లె గోపాలు కేకేసిండు.

"ఇగో నాకాతల ఇంకో సీస పట్టుకరా?" పాపయ్య.

"ఇప్పటికే ఎనుబై రూపాలయినయ్." ముత్యాలు.

"ట్రై తెరె. నా ఇల్లు సీకు రాసిత్త - పెండ్లాందెంక పోయింది. పెండ్లాం లేంది ఇల్లెందుకు?" పాపయ్య.

"నరుని బతుకు నష్టబమునుగంగ
ఇల్లేమి, తల్లేమి సిలుకా!" గుత్తి రాయమల్లు దీర్ఘం తీసిండు.

అక్కడ అన్ని వయసుల వాళ్ళున్నారు. అన్నికులాల వాళ్ళు మాత్రం లేరు ఆ పల్లో. కులాలవారిగా, హోదాలవారిగా దాదాపు అలాంటిది మరో ఏడెనిమిది చోట్ల గుమింబా వ్యాపారం జోరుగా సాగుతోంది.

"నీ యింట్ల పీనెగెల్ల ఈడ సచ్చినవా? కోమటింటికి బోయినూనె తెమ్మంటె గొంతిలకచ్చె దన్క తాక్కుంట కూసున్నవా? నోరు తిరుగకుంట తాగి ముద్దెల్లెలుక లేత్తే పోరగండ్లకేం పెట్టాలె - నీ కూడు గలదిన్య నీకేం పెట్టాలె - మానం లేదు సెత్తుకు, సెరం లేదు - అన్నలింట్ల పీనుగులెల్ల సార బందని పెట్టిరి. అవ్వాల్ల మీ కడుపులు సల్ల గుండనంట - రాయరామేసునికి తక్కెడ బెల్లం పంచి పెడ్తననుకుంటి సర్కారు సార అమ్ముడు బందాయె-ఇంటికోపొయ్యి లేసె. సుట్ట దాగేదాన్ని ఇడిసి పెడితె పొవాకు నమిలేది దొరికినట్టయ్యింది. ఈ ఊరుపాడుగాను - కాలికూలిపోను. చిక్కన సీకటయ్యిందంటే-" గోపాలు భార్య వీరలక్ష్మి తను వచ్చినపని మరిచి పోయి కంతపడి అవల రిసుతోంది. ఆమె చంకలో వాసురు కాసురుగా ఉన్న పిల్లొకతి ఏదర ఏదరగా ఏడుస్తోంది.

ఆమె నెలల కడుపుతో నున్నది.

"పోరా గోపాలు." ఎవరో అన్నారు.

"నువ్వెవతివే నేను లాకలాంతాగుత." గోపాలు అంతమంది ముందు భార్య తిట్టడంతో రోషంగా.

"ఎవతినా? అన్నలత్తె నేనెవతినో తెలుత్తది. సానొద్దులామెరాక మీ గొంతి కెల దాక పోత్తన్న మత్తన్న బొక్క మీ బొక్కలిరుగుతయ్" అవలి నుండి వీరలక్ష్మి.

"దెహెఁ పోయే. నీ అన్నలు నువ్వు ఏం జేసుకుంటరో? సాతగాని సినాలి లం....లు కండ్లల్ల కారం బోసుకుంటండ్లు. రానియ్యి అన్నలనే అడుగుత. అన్నలు మేం ఉపాస మువ్విడుంటె పెట్టిండ్లా? మాల మాదుగుల కుప్పేసి భూములు పంచిండ్లు అయినా ఈ ఊళ్ళె నేనొక్కదాన్నే పెద్దుతేను. నీ మొగడే దొరికిండా?" ముత్తయ్య పెండ్లాం ఆగమ్మ బయటకొచ్చి చేతులాడిస్తూ నిలబడ్డది.

ఆగమ్మ పొట్టిగా ఎర్రగా ఉంటుంది. ముంగిస మూతి అప్పటికే తాగున్నదేమొ ఆమె శరీరం యూవత్తా ఉల్సికొక్కులాగ ఎగిరిపడుతోంది.

వీరలక్ష్మి దగ్గిరి కాన్పుతో, చేసే దిక్కులేక ముప్పయి నిండకుండానే ముసలిదై పోయింది. ఆమె చెంపలు ఏ మాత్రం మాంసం లేక ఎముకలు దేలి ఉన్నాయి.

ఆమెకు ఆగమ్మను ఎదుర్కొనే శక్తి లేదు. పైగా ఆగమ్మ పొద్దంతా గుడుంబ కాస్తూ ఇంట్లోనే ఉన్నది. వీరలక్ష్మి నాటేయబోయి వచ్చింది.

"మన బంగారం మంచిది గానిది మంది నంకేమున్నది ?.... ఏమాయె తాగింది సాల్లేదా ? రావు" వీరలక్ష్మి మొగన్ని ఉద్దేశించి పిలిచింది. ఎందుకో ఆగమ్మ గొంతు గురగురలాడింది.

చింతచెట్టు మొదట్లో మునిమాపుగి చేసుకున్న మేఘంలాగా కూర్చున్న ఆగమ్మ మీది రమేశ్‌కు యమ కోపంగా ఉన్నది. వదినను తిట్టకుండా వీరలక్ష్మి ఓడిపోవడం అతనికి బాగనిపించలేదు. అతనికి వదినెమీద, అన్నమీద - అక్కడ కూర్చుండి తాగుతున్న వాళ్ళందరి మీద చెప్పరానంత కోపంగా ఉన్నది.

రమేశ్‌ను అన్నా వదినెలిద్దరు నిండా ముంచారు. రమేశ్ ఆరు సంవత్సరాల వయస్సప్పుడు తల్లి చనిపోయింది. మరో రెండేండ్లకు తండ్రి చనిపోయాడు. అప్పుడు అన్నావదినెలు అతన్ని ఇంట్లో నుంచి వెళ్ళగొట్టారు. రమేశ్‌కి ఏ పనివడితే ఆ పని

1090

చేస్తూ ఇంటికింత తింటూ బతికాడు. పదునాలుగేండ్ల వయసప్పుడు అట్లా బతకడం ఏలుకాక ఊరెల్లిపోయి నాలుగేండ్లు తిరిగి తిరిగి ఎక్కడున్నాడో ఏం తిన్నాడో తెలువకుండా రెండుసంవత్సరాల క్రితమే ఊర్లోకొచ్చాడు. అప్పుడు ఎవలు రమేశ్‌ను పట్టించుకోలేదు. మూడునెలల కింద పక్కూరి బాలయ్య రమేశ్‌ను చేరదీసి తన వదిన బిడ్డను తూరుపు నుంచి తెచ్చి చేశాడు.

పెండ్లప్పుడు అన్నా వదినెతో సంబంధం కలిసింది. పెండ్లి అప్పు నాలుగు వేలు మీదెత్తారు. సరే ఇద్దరు కలిసి కలోగంజో తాక్కుంట బతుకుదామంటే పెండ్లాంకు ఏం రుచి దొరికిందో గాని ఆ ఇంట్లో నుంచి రానంటది.

ఆ ఇంటిముందు తాగుడుమేళం జమకావడం అదంతా రమేశ్‌కు పరమరోతగా అసహ్యంగా ఉన్నది. ఆ వాతావరణం నుండి భార్య రానంటున్నది. రోజూ ఎడంగా కూర్చుండి ఆ తతంగమంతా భరించడం గలీజుగా ఉన్నది.

"అన్నలు గరీబోన్నితంతరా ? పెద్ద పెద్ద ముస్తైదార్లను తంతరు గని" అన్నారెవరో ?

"అన్నలత్తె అందరికన్న ముంగటనే ముత్తయ్య తమ్మూరుగదా !"

"ఓ నాయిన ఇంటికి రావానే." బజారులో ఒకాయన ఎవరికో పిలుస్తున్నాడు.

"రానుపోరా?" అంటున్నాడు మందిలో నుండి ఎవరో-

రమేశ్ వదిన ముఖం చూడలేక నిలుచున్నాడు.

"నాయిన్నను పిలుత్తన్నవ్-నువ్వు నుతరావాదు పిలతా ?" అగమ్మ కృత్రిమంగా నవ్వింది.

రమేశ్‌కు ఆ నవ్వు కారం పూసినట్టుగా తోచింది. అయిపోయింది. పైసల కోసం వదిన ఏదంటే అది చేసేటట్టే ఉన్నది. మూడు నెల్లల్ల ఎంత మారిపోయింది. గిక్కన్నే ఉంటె రాయేశ్వరి గంతే అయితది. తాగినోల్లు గోసులాసిపోగా కిందా మీద పడడం, ఒకరి నొకరు కొట్టుకోవడం రమేశ్ చూస్తూనే ఉన్నాడు.

రమేశ్ అక్కడ ఉండలేక బజారులో నడుస్తున్నాడు.

కరెంటు బుగ్గల వెలుతురులో పిల్లలు ఆడుతున్నారు.

"ఎన్నెలరాత్రుల్లో అన్నలొచ్చారూ!

నేనేమిసేతునె నేనెందుపోదూ !" పదహారు సంవత్సరాల సుగుణ ఒంటిగా రాగం తీస్తూ తనవెదురైంది. ఆ కంఠం హాయిగా కమ్మగా ఉన్నది. ఎందుకో

రమేశ్‌కు జలజల కన్నీళ్ళు ఉప్పొంగాయి. అంతదాక కోకిల్లా పాడిన సుగుణ నోరు మూసుకొని పరుగెత్తింది.

రమేశ్ గబగబ నడిచాడు. కాపుల సుబయ్య ఇంటి ముందు పొట్టి దుర్గయ్య గోడమీద నుండి బజాట్లోకి దునికాడు. అతని జుట్టు చెదిరి ఉన్నది.

“ఎవలు నా పెంటం దీకలేరు” అంటున్నాడు.

లోపలినుండి దుర్గైకాళ్ళ మొగలి ఇకిలిస్తూ ఏదో అన్నాడు.

ఊరంతా బేకారై పోయింది. ఎనుకటి పెద్దమనుషులు పండగలకు పబ్బాలకు తాగేటోల్లు. వాళ్ళు తాగినారంటే ఊళ్ళోవాళ్ళు వాళ్ళెదురుబోయే వాళ్ళుకాదు. సర్కారు సారావచ్చి దుకాణం పెట్టేసరికి— ఒక్కనే సారా దొరకబట్టి అందరు అల-వాటయ్యిండ్రు—సగం సంపాదన సారకే పోతుంది. అన్నలు యేటా సారాకొట్లు పలుగ్గొడుతనే ఉన్నరు. ఇయ్యాకు దొత్తులకు బంద చేసిండ్రు—అవ్వెల్లి మందులకు సార దొరుకలే—తెనుగోల్లు, నాతకానోల్లు దొంగతనంగ తెచ్చి కల్లమీద అమ్ముకునేటోల్లు—వాళ్ళనుబోయి ఊరోల్లు కొట్టిండ్రు—ఇద్దరి కాల్రెక్కలు విరిగిపోయినయ్. పంచాయతి—కేసులు—అన్నలచ్చే దీరోల్లు దీరోల్లు కొట్టుక సావద్దు అంటు తీర్మానం చేసిండ్రు—పదిరోజులు ఎవరు సారాకొట్లకి పోలేదు. పదిహేనోనాడు మూడు కోమటి దుకాన్లల్ల నల్లబెల్లం మస్తుబ దిగినయ్. ఒక్కొక్కక్కు షురు చేసిండ్రు మూడు నెల్లల్ల రెండుసార్లు అన్నలచ్చిండ్రు—మొదటి సారచ్చినపుడు భూములు దున్నిన పంచాదుబడి సార వెనుకబడిపోయింది.

అయింక భూములు దున్నినంక పోలీసులచ్చి—దెబ్బలు, కొట్లు ఆగాయి లుండంగనే రెంకోపారి గడిచిపోయింది తను ఎల్లైన చెప్పనామనుకునేటాల్లకే వీరంసాయిలు బిత్తె పంచాయతు అత్తమచ్చింది. ఇగసూస్కో—ఇరు ఊరంత అద్దు ఫిరాదు లేకుంట తాగి తలకు పోసుకుంటండ్లు.

రమేశ్ ఇట్లా ఆలోచిస్తూ ఊరు చివరకొచ్చాడు. మర్రిచెట్టుకింద మాదుగులు కూర్చుండి తాగుతున్నారు. ఏటుదోయినా లాభం లేదనుకుంట వెనుదిరిగేసరికే కంటె లింగయ్య ఎదుకొచ్చిండు.

“రమేసు, నువ్వేనా? నువుసుత తాగినవా?” లింగయ్య.

“ఏహే లేదన్న. మాయింటికాడ సిందిమాదిగి భాగోతం నడుస్తుంది. ఊళ్లె ఉండవశం అయితలేదన్న”.

1092

"గిదేం మంచిగలేదు రమేసు. మంచిపనికిరాదు. అరె ఖాషులు దున్నదాం రాండ్లిరా అంటే ఒకడు ఏర్గత్తందని అటుదబేపోతడు. మరొకనికి కడుపు నొప్పి లేత్తది. పుల్లహర్రాసుల త్తన్నయ్. మొన్నకిట్టపురం, బొబ్బెరపెల్క, అటుమొఖాన నీల్‌వాయిల కాయిదాలేసిండ్లట – ఈపారి అమ్మినోనితోటట్టు తాగినోన్ని తన్నాలె". లింగయ్య.

"ఇంటికో దుకానం బెడితెనే ఏమంటలేరుగద అన్నలు".

"అంటరువయ్య! ఒకదానెనుక ఓటిసేసుకత్తలేరా? అయినా అన్న ఎవలే– మనమే....అందరు తాగుతంటె మనసొంటోల్లు అడికీడికి తిరుగుతండ్లుగని—"

"తెనుగోల్లను, సాతకానోల్లను మనం బొయ్య కుండలు పలుగ్గొడితె అన్నలు కోప్పడలేదా? గదే అలుసైంది". రమేశ్ –

కంటులింగయ్య సబ్బుకోసం కోమటింటికి వస్తున్నాడు. వాళ్ళ నాయిన తాగుబోతే – ఇంకా పెండ్లి కాలేదు. రమేశ్‌కన్నా రెండేండ్లు పెద్ద. ఇద్దరు నడుస్తున్నారు.

"ఇంకా తానం జెయ్యలేదా?" రమేశ్.

"ఏడ–ఇయ్యేడు ఎనుకయ్యింది పొలం....ఊళ్ళె పొలాలన్ని పది దినాలకింద నాట్లయితే– ఇయ్యల్లయ్యింది మా పొలం. జంబుకొట్టిన. బొనువ్వన్నమాట నిజమే. మనూల్లె అసలోడెవ్వడు లేకపాయె. ఉన్నసాలోల్ల మధునయ్య ఒక్క దెబ్బకే బొగ్గుబాయిల కాడికి దెంకపాయె–చీపురుసెట్టి మల్లయ్య మనందరిని విడిచి జంగల్లకుబాయె. పెన్నారెడ్డి జమానల ఎగిరి నోల్లంత ఎల్లెలుకలబడిరి. ఎవల నడుగాలె...." లింగయ్య.

"మారె గల్లెట్లయితది–ఎవలు లేందే గియ్యన్ని జర్గతన్నయా? అడుగును నోళ్ళు అడుగున ఉంటరుగద–"

ఇద్దరు మాట్లాడుకుంటూ వచ్చేసరికి వేపచెట్లకింద షావుకారింటిముందు పది పదిహేను మందున్నారు. అందులో చాలామంది పక్కపల్లెలోల్లె.

లింగయ్యను విడిచి రమేశ్ ముందుకు నడిచాడు.

బాలుమామతో సెప్పాలె. రాయేసివత్తెదోరాదో? ఏడనన్న పొరుకలు సాటు గట్టుకొని బతుకుత – నా పాలు నాకు పంచుమనాలె – రేపు ఏదో ఒకటి తేల్సుకోవాలె.

ఇంటి ముంగటికి వచ్చేసరికి అందరు వెళ్ళిపోయారు. పందిరికింద పాపయ్య పండి బొర్లుతండు. వంగి చూశాడు. అసహ్యంగా గుడుంబా వాసన గుప్పుమన్నది.

"నే....ను చంపిన్నానా? మనిషి– బతుకులేనిచేత్తడు. చేతగాక అమ్ము కున్ననా? నాకొడుకు–నా బిడ్డ". పాపయ్య ఎందుకో ఏడుస్తున్నాడు.

రమేశ్‌కు అసహ్యం స్థానంలో నాభిలో కలుక్కుమన్నది. దాదాపు తనలాగే పాపయ్య కూడు కుమ్ములేక నా అన్నవాళ్ళులేక తిరుగుతున్నాడు. రమేశ్ పాపయ్యను లేవనెత్తి వాకిట్లోని గడంచలో పడుకోబెట్టాడు. పంపుల దగ్గరి నీళ్ళు తెచ్చి ముఖం మీద కొన్ని చిలకరించాడు.

"ఇది నాయిల్లు–ఆడిబట్ల గాడ్దికొడుక–" అగమ్మ తలుపు దరువాజకేసి బాదుతోంది.

"నీ యిల్లా–గొడ్డటనరుకుత". ముత్యాలు ఉన్నకాడనే ఎగురుతున్నాడు.

దీపం ముందు బిక్కు బిక్కు మంటూ కూర్చున్న పిల్లల మధ్య రాజేశ్వరి తెల్లమొఖం వేసుకొని కూర్చున్నది ...

రమేశ్‌కు ఆకలి కరకరలాడుతోంది. ఆ కొట్లాట తెగకుండా తనకు తిండి దొరికే యోగం లేదు.

మళ్ళీ చింతకై నీడలో వచ్చి తల పట్టుకొని కూర్చున్నాడు.

పన్నెండేళ్ళ శ్రీనివాస్ "అన్నలచ్చిండ్రు" అనుకుంటూ పరుగెత్తాడు.

అన్నలపేరు వినగానే రమేశ్ ముఖం కలకలలాడింది. "ఎక్కడికొచ్చారో" తెలుసుకుందామనుకునే సరికే శ్రీను వెళ్ళిపోయాడు.

రమేశ్ ఆదరబాదరగా ఊరి స్కూలు బిల్డింగ్ దగ్గరికి పరుగెత్తాడు.

అప్పటికే స్కూలు బిల్డింగ్ దగ్గర ఎట్లా తెలిసింపోగాని మాదిగ, మాల, గొల్ల, కుర్మ, కాపు అందరు వచ్చి కూర్చున్నారు. ఇంకా వచ్చేవాళ్ళు వస్తున్నారు. కరంటు బుగ్గ వెలుతుర్లో ముదురు ఆకుపచ్చ బట్టలేసుకున్న దళపోల్లు జబ్బలకు తుపాకి లేసుకొని అందరిని కూర్చుండ బెడుతున్నారు.

లింగయ్యను వెంటబెట్టుకొని ఒక అన్న చెరువు పక్కనుంచి వచ్చే బండ్ల బాటకేసి సెంట్రీకోసం పోయాడు.

రమేశ్‌కు పోవాలనే ఉన్నది. ఆ తుపాకి ముట్టి చూడాలని, వీలైతే తన అన్నతో తన ఆస్తి పంపకాల గురించి మాట్లాడాలని–భార్యను విడిగా తీసుకపోవ డానికి అన్నలతో ఒక మాట చెప్పించాలని యమ ఉబలాటంగా ఉన్నది. కాని ఇక్కడ అందట్లో అన్నలు చెప్పే ముచ్చట్లు విననేమొనని ఆ ప్రయత్నం మాను కున్నాడు.

తూలుతూనే మంగలి ఇత్తారి అన్నల దృష్టిలో పడాలని అందరిని కూర్చుండ పెడుతున్నాడు....భార్యమాట వినకుండా తమ ఇంట్లో తాగిన గోపాలు ముందే ఉన్నాడు. విచిత్రం తన అన్న అందరికన్నా ఎక్కువ బుద్ధిమంతునిలాగా చేతు లూపుతూ తిరుగుతున్నాడు.

భార్య రాజేశ్వరి వచ్చిందేమోనని చూశాడు. రాజేశ్వరి జ్యోతక్క సుశీలక్క పక్క సిగ్గుపడుతూ నిలుచున్నది.

కమాండర్ పెద్దన్న కన్పించ లేదు.

భిక్షపతి నడిమందిలో నిలుచుండి తలపాగైన గొడ్లబోయిడి తైలికాల నవ్వు నవ్వి— “అన్నలు అక్కలు అందరచ్చిండ్లు సంతోషం. ఖుర్సతుగ మాట్లాడుకుందాం గని తిరిగి తిరగచ్చినం మాకు తిండి తిప్పలు సూసేదున్నదా? లేదా?” అన్నాడు. భిక్షపతి తీరేగంత ఎప్పుడు ఆవలినుంచి నరుక్కొచ్చేరకం.

“ఒస్ గంతేగద—అన్నలు సెలవిచ్చ్యాలెగని కోళ్ల గోసిసిడిసెల పెట్టము” ముత్తయ్య.

నోట్లో నీళ్ళూరినట్టు పెదిమలు నాక్కొని— “సీదేంది మాపెడుతవు నీయింటి కాడ తింటె మరి ఊళ్ళోల్లు నారాజుకారా?” భిక్షపతి

ఉపసర్పంచ్ జనార్థన్ తెల్లటి ధోవతి సింగులు పైకి పట్టుకొని “మనింటి కాడ ఇంతె గాసులు సేపిచ్చేదా?” అన్నాడు.

“వాహెవాహ్వా ఇయ్యల్ల నక్కను తొక్కొచ్చినట్టే ఉన్నది....ఒకలింట్ల దిని మరొక లింట్ల తినకపోతే కోపమత్తది. మా కామ్రేడ్స్ వస్తారు తలాకొంత పెట్టండి. ఈలోగా మన కార్యక్రమాలు కొనసాగిస్తాము. ఏమంటారు కామ్రేడ్స్” అన్నాడు భిక్షపతి.

భిక్షపతి పొట్టిగా వామనఛాయగా ఉంటాడు. నోట్లోకంటా వంగిన మీసాలు— దళంలో అందరికన్నా ఎక్కువ వయసుగలవాడు భిక్షపతే—అతను గతంలో గొడ్ల బోయిడు. మంచిమాటకారి.

ఇద్దరు దళసభ్యులు తిండి వ్యవహారాలు చూడటానికి వెళ్ళారు. మరో యిద్దరు అప్పటికే ఊళ్ళో రోగులకు మందులిచ్చి అప్పటికే అన్ని ఇండ్లు కలెదిరిగి వచ్చారు. అందులో ప్రభాకర్ ఈ ఊళ్ళో వివరాలు నోటు చేసుకుంటున్నాడు.

మహిళా సభ్యులిద్దరు విడిగా స్త్రీలల్లో కూర్చున్నారు.

1095

అప్పటికే నలుగురు సభ్యులు అంతకు ముందే ఆయుధ శిక్షణ ఇచ్చిన గ్రామస్తులను తీసుకొని సెంట్రీకోసం పోయారు. కమాండర్ పెద్దన్న — అనేక కారణాల రీత్యా ఛిన్నాభిన్నమైన పాతగ్రామ కమిటీ స్థానంలో కొత్త కమిటీ నిర్మాణం గురించి తమ అంచనాలలో ఉన్నవాళ్ళతో విడిగా సమావేశంలో కూర్చున్నాడు.

ఆనాటి మీటింగు నిర్వహణ, తక్షణ కార్యక్రమం, ఉపకమాండర్ భిక్షపతి నిర్వహించాల్సి ఉన్నది.

శ్రీను మిగతాపిల్లలు అందరికన్నా ముందే భిక్షపతి పక్క నిలబడ్డారు.

సమావేశం మొదలౌతుందనే సూచనగా సుగుణ అమరవీరుల పాట పాడుతూ వుంటే రాయేశ్వరిని ఎవరో కోరస్ కోసం తోశారు. రమేశ్ గుండె గుబగుబలాడింది రాయేశ్వరి బెదిరిపోయి తలవేళ్ళాడేసుకొని నిలుచున్నది.

సుగుణ యమ ఉత్సాహంతో పాడింది.

ఎవరో మందిలోనుండి అమరవీరులకు అన్నారు. అందరుజై కొట్టారు. తుపాకి పట్టుకొని ఆరాముగా నిల్చుండి తన్మయత్వంతో వింటున్న భిక్షపతి ఉలిక్కిపడి తేరుకొని

“మంచిగ పాడినవ్ సెల్లె నా కండ్లల్ల నీళ్ళచ్చినయ్” మెచ్చుకున్నాడు. భిక్షపతి సరాయించి “ఇవాళ అసలు సంగతేందంటే”— అప్పుడే పసిబట్టినట్టు వాసన పీల్చి “ఇయ్యాల్లేందో అత్తరు వాసన జమాంచి కొడుతంది?” అన్నాడు.

ఆ మాటకు అందరు నవ్వారు.

“అత్తరువాసన కాదు. గుడుంబవాసన” అన్నది మాలోల్ల గుంపులోనుంచి సుక్కపోసు.

“అదా సంగతి — అయితే మన మీటింగు మాంచి జోరుమీద సాగుతదన్న మాట — అప్పుడే అనుకున్న. — అన్నలు మాంచి హుషారు మీద తిరుగుతండ్లేంది అని”

ఎప్పటి సుంచో ముంగాళ్ళ మీద కూర్చుండి అడుగుదామనుకున్న కాపు లసుమయ్యలేచి ఎవరిదో కాలు దొక్కాడు.

“అన్నన్న సంపుతివి గదా!” అన్నదెవరో?

“సైసుసైసు” అనుకుంట కాపు లసుమయ్య భిక్షపతి దగ్గరికొచ్చి భిక్షపతికి సొలుగుతూనే షేకొహాండిచ్చాడు.... గుడుంబవాసన గుప్పుమన్నది.

1096

"నలుగురికి పెళనార్తి, పెండ్లి గావాల్సిన నా బిడ్డను ఏనుగుల కిట్టయ్య రెట్ట బట్టిండు. ఊళ్లె పంచాతు బెడితే కిట్టని అయ్యకు పదెకరాలున్నదని ఆళ్ళపట్టే మాట్లాడిండ్లు—నా బిడ్డను గిప్పుడు ఎవలు జేసుకోవలె—దేవుళ్ళ కెదిరి సూసినట్టు సూత్తన్న" లసుమయ్య అప్పటికప్పుడు దుఃఖం తెచ్చుకొని ఏడువబోయిండు.

భిక్షపతి ముఖంలో నవ్వు మాయమయ్యింది. అతను చెప్పదలుచుకున్న విషయాలన్నీ మరిచిపోయాడు. ఆ పిల్లను రెక్కపట్టిందో, మరేదన్న చేశాడో అడుగుదామంటే ఖావ్యంకాదు. అక్కడ కూర్చున్న వాళ్లెవరు కాసేపు చప్పుడు చెయ్యలేదు అంటే గొడవ బాగనే జరిగిందన్నమాట.

"ఏమంటరు లసుమయ్య సంగతి?" భిక్షపతి.

"కిష్టయ్యను పిలిచి అడగండి" అన్నారెవరో?

"కాదు ఉన్నదంత వాళ్ళ నాయిన్న దగ్గర్నే ఉన్నది" అన్నారింకెవరో?

వాళ్ళనాయిన రామచంద్రం చేతులెత్తి "నాదేమిలేదు వాడు సేసుకుంటనంటె గిడనే పెండ్లి చేస్త"నన్నడు.

కిట్టయ్య నెవరో ముందుకు తోశారు. కిష్టయ్య నిలువెల్లా చెమటలు పోశాయి. మనిషి గజగజ వనుకుతున్నాడు.

"భయంలేదు తమ్మి నీమనసులోమాట చెప్పు" భిక్షపతి.

కిష్టయ్య ముఖం వాల్చుకొని "చూసుకుంట చూసుకుంట బురద నీళ్ళు తాగు మంటె నావశంగాదు" అన్నాడు.

"బురదనీళ్ళా—నీకు సిగ్గులేదు. అసొంటోనివి ఆ పిల్ల చెయ్యి పట్టుకోంగ పడబోయింది. నువ్వు సొక్కం పూసవేన" సుశీలక్క పట్టరాని కోపంతో పరుగెత్తు కొచ్చి కిష్టయ్య గల్లాపట్టుకునేదల్లా భిక్షపతిని చూసి ఆగిపోయింది.

"కోపమద్దు కామ్రేడ్" భిక్షపతి.

అంటే కిష్టయ్య ఆ అమ్మాయిని చేసుకోవడానికి సిద్ధంగాలేదు. వీళ్ళు లసుమయ్య కన్నా స్థితిమంతులు. రామచంద్రం కొడుకు కట్నం గురించి ఆశపెట్టు కున్నట్టున్నది.

ఇలాంటి పంచాయిదుల్లో ఎటుపోయినా ఎంతో కొంత బదునాం పార్టీకి అంటుకుంటున్నది. బహుశా లసుమయ్య తరపున కూడా కిష్టయ్యను ఇరికిద్దామనే ఆలోచన ఉండి ఉంటుంది....

1097

కాసేపటికి మందిలో గొనుగుడు ప్రారంభమయ్యింది.

"ఆడపిల్లను బురదనీళ్ళన్నందుకు కిట్టయ్య ముక్కు బూమికి రాకవల్సిందే" అన్నది హరిజన బొనమ్మ.

అసలు గొడవపోయి ఇదో గొడువయ్యింది. మొగోళ్ళల్లకొందరు "ఆ పిల్ల సొక్కుప్పాస" అన్నారు. ఎక్కువ కులాల ఆడవాళ్ళు ఏదో అరిచారు.

పునాసలప్పుడు మందోట మీది గొడ్లలాగా అయ్యింది పనివరుస—ఇదిట్లా సాగుతుండగానే కిట్టయ్య ఎవలు చెప్పకుండానే ముక్కు భూమికి రాశాడు.

లసుమయ్య నిలబడలేక మందిలో కూర్చున్నాడు.

భిక్షపతి పక్క నిలబడగానే ప్రభాకర్ వచ్చి పెళ్ళికి సంబంధించి దళం ఏమనుకుంటుందో చెప్పిండు.

అఖరున భిక్షపతి "కిష్టయ్యా, ఆ అమ్మాయి కోపంతో కాకుండా దోస్తానితో ఒకరినొకరు అర్థం చేసుకోవాలని, కిష్టయ్య బుద్ధితక్కువై ఆ పిల్ల చెయ్యిపట్టుకుంటే ఆ పిల్ల తగిన జవాబు చెప్పగలుగాలని అప్పుడే గిసొంటి సంగతులు జరుగవని— ఊళ్ళో మహిళా సంగం లేదనుకోండ్లి. గందుకనే పెట్టుకోండ్లని చెపులిల్లు గట్టుకొని సెప్పుతండ్లు మన అక్కలు"— ఇలాగా చెప్పుకొచ్చాడు.

"అసలు నన్నడుగుతె లసుమయ్య ఇంటికాడ గుడుంబ అమ్ముతాంటెనె గిట్ల జర్గింది" అన్నది సుక్కబోసు.

భిక్షపతి సుక్కబోసుకు మనసులోనే దండం బెట్టుకొని అసలు విషయం ప్రారంభించ బోయాడు.

అంతట్లనే ఎవలో పెద్దేలున తుమ్మారు.

"ఓర్నీ అసలే సార సంగతి"— భిక్షపతి పెకపెక నవ్వుతూ, అందరు నవ్వారు.

పొట్టి పెద్దులు లేసి కంచు కంఠంతో ఏదో చెప్పబోయాడు. అతనికే చెప్పరాక నిషా ఎక్కువై కూర్చున్నాడు.

ఇలాంటి లక్ష తొంబై పంచాదులతో కాలంగడుస్తుంది. అఖరుకు వచ్చిన పని ఆగిపోతుంది.

భిక్షపతి మళ్ళీ మొదలుపెట్టాడు.

"ఏటా ఇచ్చినట్టుగనే ఇయ్యేడు సారా బందు పిలుపిత్తన్నమ్. ఇయ్యేడు మన రాష్ట్రం మొత్తంల సర్కారు సారా అమ్మద్దు. ఈ నెలాఖరుకు హర్రాజులున్నయి.

....హ్రరాజులకేవలు పోవద్దని మనం పిలుపిత్తన్నమ్." భిక్షపతి మాట పూర్తి కాక ముందే.

"సారా హర్రాజులు పట్టినోన్ని కాల్రెక్క విరువాలె" నన్నాడు దాసరి ముత్యాలు. ఇంకా పదిపదిహేనుమంది ఇరువాలెనన్నారు. అప్పటిదాకా అనాసక్తిగా ఉన్నవాళ్లు కూడా ముందుకు జరిగారు. సారా అమ్మకాలతో ఈమధ్య బాగుపడ్డ ముత్యాలులాంటి వాళ్ళమీద తాగుబోతులకు కోపంగా ఉన్నది. ఆడోళ్ళకు మొగోళ్ళం దరి మీద కోపంగా ఉన్నది. ఊళ్ళో సర్కారు దుకాణం లేకపోతే తమ దందా బాగా జరుగగలదని యమ సంతోషంగా ఉన్నది. బడి గోడ కానుకొని కునికిపాట్లు పడుతున్న కోమటి రామయ్యకు ఈమాట నాగసరం ఊదినట్లుగానే ఉన్నది.

భిక్షపతి ప్రభాకర్‌ను టైమెంత అని అడిగాడు. బాగా చీకటైనట్లే అన్పిస్తున్నా అప్పటికి పావుతక్కువ తొమ్మిదే-అంటే బాగనే టైమున్నది.

"ఇయ్యేడు ఏంజర్గింది. సర్కారు సారా సాలు పొడుగుత అన్ని ఊళ్ళల్ల తీర్గనే బందు పెట్టిచ్చినందుకు మన ఊరును మెచ్చుకోవాలె ఈ పాటికే సానమంది సార తాగడం మానేసిండ్లనుకుంట"- కావాలనే అన్నాడు భిక్షపతి.

ఆ మాటకు మొగోళ్లు నవ్వారు. ఆడోల్లు మూతులు తిప్పారు.

"ఈ ఊళ్లెకు రాంగనేను గట్లనే అనుకుంటచ్చిన. కని ఊరు సొర్రంగనే గుడుంబ వాసన జమాంచి కొట్టింది. గీ సభల సుత ఇంకా వాసన అత్తనే ఉన్నది". అన్నాడు.

"బొ....బొ...." అన్నారు ఆడోల్లు.

"మొదట సారా బందనేటాల్లకు ఊళ్ళోల్లు ఏమనుకున్నరో జెరచెప్పు" మంగలి ఇత్తారిని పిలిచి అడిగాడు....

"ఓహో( మారాజా అన్నలు మా మాంచిపని చేసిండ్లనుకున్నం" అన్నాడు బుడ్డరకాం లాగా చేతులు తిప్పుతూ.

"అంటే ఇత్తారన్న తీర్గనే అన్నలను తాగెటోల్లు తిట్టిండ్లు-అక్కలు కడుపు నిండ తిని కంటినిండ నిదురబోయిండ్లు--ఫైర్-గుడుంబ అమ్మిన తెనుగోల్లను కొట్టిండ్లు. ఇగ అప్పుడు పేదోల్లను కొట్టద్దు అన్నం అప్పటినుండి ఊరంతా గుడుంబ పారుతుంది" భిక్షపతి.

వీరలక్ష్మి లేచి "అన్నలా-పూర్తిగా అద్దు ఫిర్యాదు లేకుంటయ్యింది. ఇగో గీడ ఇపసారి పిట్ట తీర తిప్పుతనోళ్లల్లంత-మాపటేల్లయ్యిందంటే ఊరంత-సార

దుకాణమైపోతుంది. సర్కారింట్ల పీనిగెల్ల ఆళ్ళప్పుడే ఏడనో ఓ దుకాణముండేది. అది ఫిరముండేది. గిప్పుడు ఇంటికో దుకాణమైపోయింది". అన్నది ఏడుపు గొంతుతో.

భిక్షపతి "వారేవాహ్వా మనోళ్ళు ఎండ్లనైన ఒక్కడుగు ముందుకు పదడుగులు ఎనుకకుండేటోల్లు-గిండ్ల మాత్రం పదడుగులు ముందున్నరు. సరే మంచిది. కని ఇట్ల మంచిగలేదు. ఊరంత సార తయారుచేస్తే నాగండ్లెవలు దున్నాలె.... కనుక గుడుంబ మంచిగ చేసేటోల్లుంటె ఇగో ఇక్కడికి రాండ్లి. మన ప్రభాకరన్న పేర్లు రాసుకుంటడు" భిక్షపతి.

ఆ మాటలు నాగసరం నాదంలాగనే తోచాయిగాని పుట్టలోనుంచి ఎవలు బయటకు వెళ్ళాలో తెలియలేదు.

"ఇంకా మేం బువ్వ తినలేదు. వాళ్ళు వస్తే పేర్లు రాసుకుంటం. ఇకనుంచి వాళ్ళే ఊళ్లె గుడుంబ తయారుచేసి అమ్మాలె-" భిక్షపతి.

ఆడోళ్ళంత భిక్షపతి మీద కుతకుత ఉడుకుతున్నారు.

అప్పుడు ముత్తయ్య, లసుమయ్యతోపాటు మరో పద్దెనిమిదిమంది ముందుకు వచ్చారు. వాళ్ళందరిని స్కూలు బిల్డింగ్ గోడ పక్క నిలబెట్టి ప్రభాకర్‌తో పేర్లు రాసుకొమ్మన్నాడు భిక్షపతి.

మరో పదిహేనుమంది లేచారు. అందులో గోపాలు కూడా ఉన్నాడు. గోడవార నిల్చున్నవాళ్ళు గొల్లున లేచారు.

"అసలు వీళ్ళకు గుడుంబ తయారు చేసుడురాదు. ఉత్తగనే పేర్లు రాయించు కుంటండ్లు-" అన్నాడు ముత్తయ్య.

భిక్షపతి కాసేపు దీర్ఘాలోచనలో పడ్డట్టు నటించి, "అయితే చెప్పండ్లి ఒక్కొక్కలు గుడుంబ ఎట్ల తయారుచేస్తరో ?" అడిగాడు.

"నల్లబెల్లం, ఇప్పపువ్వు, మురికి తుమ్మ సెక్క" లసుమయ్య.

"అమోనియా, ఊరియా-" గోపాలు.

"ఇంత ఉచ్చ, ఇంత పియ్య-మీ యింట్ల పీనుగులెల్ల సిగ్గులేదు." కొండమ్మ అంతెత్తు లేచింది.

"ఆగు సెల్లె-నువ్వాగు అహాఁ" భిక్షపతి.

"నాగసరం" అన్నాడు ముత్తయ్య.

1100

అందరు తలా కొన్ని పేర్లు చెప్పారు. నీకు తయారు చెయ్యరాదంటే నీకు తయారు చెయ్యరాదని వాదులాడుకున్నారు. ఎన్ని రోజులు నానబెట్టాలి? ఎంత 'బట్టి' పెట్టాలి? అని ప్రశ్నలు వేసుకున్నారు.

"అయితే ఇది తెగేట్టు లేదు. ఇప్పటికి ఎవరెవరు తయారుచేస్తున్నరో? వాళ్ళ కుండలతో సహా ఇక్కడికి తేవాలె - తయారుచేసే సామానులు బెల్లం-అన్నీ తేవాలె-దాన్నిబట్టి తేలుద్దాం. పనిలో పని బెల్లమమ్మే షాపువార్ల పేర్లు సుత రాసుకోవాలె-వాళ్ళు ఇక్కడే ఉంటే వచ్చి గోడపక్క నిలబడాలె. మన గుడుంబ తయారు చేసే అన్నలకు సాయంగ మనిషికి నలుగురు సాప్పాన బొయ్యి అన్ని పట్టుకరాండ్లి" భిక్షపతి.

ఏం జరుగుతుందో ఎవరికి అర్థం కాలేదు. ఆగోలు అన్నలను తిట్టుకుంటున్నారు. అన్నలు ఇంటికింత తెచ్చుకున్న అన్నం రకరకాల కూరలు కలిపి తిన్నారు. సెంట్రీ దగ్గరికి కొత్తవాళ్ళు పెళ్ళగా సెంట్రీవాళ్ళు వచ్చి తిన్నారు.

నానబెట్టిన విప్పపువ్వు, బెల్లం కుండలు స్కూలు దగ్గరికి చేరుతున్నాయి. బెల్లపు ముద్దలు, సంచులు, సీసలు-అన్ని గుడుంబ సామానులు ఒకరిమీద పోటీతో మరొకరు తెస్తున్నారు. గోవాలు బతిమిలాడి అప్పటికప్పుడు కారుతున్న నల్లబెల్లం రెండు పాతకుండలు మాత్రమే తేగలిగారు.

అక్కడ భయంకరమైన వాసన నిండిపోయింది.

అన్నలు తిని రెండవసారి సమావేశానికి సిద్ధమయ్యారు.

ఈసారి ఆగోల్లు చాలా ఎక్కువమంది వచ్చారు. ఈ ఉపద్రవం ఎట్లాగైనా ఆపాలని, అన్నలు సరిగ అర్థం చేసుకుంటలేరని-తమ కాపురాలు సర్వనాశనం అయిపోతున్నాయని, ఊళ్ళో అసలు గుడుంబ అమ్మేదే ఉండవద్దని చెప్పాలని ఉవ్విళ్ళూరుతున్నారు.

అప్పటికే కమాండర్ పెద్దన్న చేరుకున్నాడు. భిక్షపతి ఎప్పుడు నవ్వు వరాశికాల పనే చేస్తడని-పెద్దన్నకు చెప్పుకోవాలని వాళ్ళు అనుకున్నారు.

"సారాబందు పోరాటం బాగనే జరుగుతున్నట్టున్నదే." పెద్దన్న విస్తుపోతూ ...

"సారబందా మన్నా! ఊళ్ళనే తయారుచేసి అమ్ముకోండ్లని భిక్షపతన్న చెప్పుతండు." అన్నారు స్త్రీలు కలిసికట్టుగా రోషంగా.

"అట్లనా? చిత్రంగా ఉన్నదే" అన్నాడు పెద్దన్న భిక్షపతికేసి చూస్తూ.

భిక్షపతి "ఊరి మొగోళ్ళంతా మనం సారాబందు పిలిపి త్తే ఊరు ఊరంత సార తయారుచేస్తండ్లు. అది మంచిదిగాదు- తయరుచేసేటోల్లు ముందుకు రాండ్లంటె అగో వాళ్ళంత వచ్చిండ్లు. ఊళ్ళె తాగెటోళ్ళు, తయారుచేసేటోళ్ళు అంతా పాపుల మందున్నరు. అగో వాళ్ళు అక్కడ నిలుసున్నారు. మిగతా మూడు పాపులాలమంది ఏమంటరో నేనింక అడుగలేదు."

"విన్నరు గదా! అదీ సంగతి. గిది గుర్రం గిది మైదానం. ముసుగుల గుద్దు లాటేంది. వాళ్లు లాకలాం తయారు చేస్తమంటున్నరు. అగో వాళ్ళు తాగుతమంటు న్నరు. సర్కారు సారా మేం బందుపెడితె అదేదో మా పనే అనుకున్నరు. దానికి తూట్లు పొడిస్తిరి. ఇక మీరేం చేస్తరో చెప్పండ్లి ? గవర్నమెంటు సింగరేణిల పోలీసుల పెట్టి అమ్మిత్తంది. ఇక్కడ మీ దాంట్ల నీరే తయారయ్యిండ్లు గదా! అగో సూసిండ్రా అన్నల సారా పోరాటం ఎట్లయ్యిందోనంట నవ్వుతండ్లు మీ దాంట్ల తాగి కుటుంబాలు సర్వనాశనం జేసుకోవడం మీరు చూస్తనే ఉన్నరు గదా!" పెద్దన్న చిన్న పాటి ఉపన్యాసం చేశాడు.

అప్పుడు ఆడోల్లకు ధైర్యమొచ్చింది. గుడుంబ సరంజామాతో నిలబడ్డవాళ్ళు షావుకార్లు బిత్తిరిపోయారు.

"బందంటె బందే. మావాల్లే తాగుడద్దు తన్నులాటలొద్దు" ఎవరో మందిలో నుండి.

"మరి వాళ్ళెమొ తయారు చేస్తమనవట్టిరి. వాళ్ళు మీవోళ్ళేగాదె" భిక్షపతి ఎడ్డితనం నటిస్తూ.

"వాళ్ల అట్లనే అంటరు" కొండమ్మ.

"అయితే ఏం చేద్దాం?" పెద్దన్న.

"ముడ్డిబొక్కలిరిత్తే సక్కగైతరు." వీరలక్ష్మి.

"మళ్ళ మా భర్తలను అన్నలు కొట్టిండ్లనరా?" భిక్షపతి.

"వాళ్ళకుండలు వాళ్ళ నెత్తులమీద పెట్టి ఊరేగించితే బుద్ధత్తది." సుక్కపోసు పెద్దన్న నవ్వాడు. ఆ నవ్వు కానియ్యిమన్నట్లు తీసుకున్నారు.

అప్పటికప్పుడు దప్పులు వచ్చాయి. దప్పులు లాల్చాపు దరువులో జెనజెన మంటున్నాయి. తలోకుండ నెత్తి మీదెత్తారు. కుండలకు చిన్న చిన్న రంధ్రాలు చేశారు. అ గబ్బు నీళ్ళు ఒళ్ళంతా అసహ్యంగా కారుతున్నాయి. షావుకార్లకు బెల్లప్పు వంచులు దుట్టారు.

1102

అలాంటి విచిత్రమైన ఊరేగింపు దాదాపు గంటకు పైగా నడిచింది.

"కల్లావద్దు లొల్లి వద్దు"

"భూమి కావాలి బువ్వకావాలి"

"సారా కాసేవాళ్ళ మెడలకు చెప్పులదండలు"

"సారా తాగేవాళ్ళ మీసాలకు సీపుర్లు కట్టండి"

మొదలగు చిత్ర విచిత్రమైన నినాదాలతో ఊరేగింపు సాగింది. ఆ ఊరేగింపుకు మహిళా సభ్యులు జ్యోతక్క, సుశీల నాయకత్వం వహించారు.

చివరకు ఆ కుండలు వాళ్ళ నెత్తులమీదనే పగులగొట్టారు. అందరికి నిషా దిగిపోయింది.

చివరగా పెద్దన్న "ఈ సంవత్సరపు మన రాష్ట్రంలో సారాచుక్క అమ్మ నిష్యం. పొలాలకేసే యూరియా, అమోనియా-ఇంకా నాగసరం లాంటివి విషాలు - మనిషిని కొద్ది కొద్దిగా చంపుతాయి. సారా తాగి కుటుంబాలు సర్వనాశనమౌతున్నాయి. కుటుంబం మొత్తం సంపాదన ఒక్కడు ఖర్చు పెట్టుకోవడానికి హక్కులేదు. ఇలాంటి చెడ్డ పనుల వలన కుటుంబాలు ఎట్లా కూలిపోతున్నాయో గారె పాపయ్య కుటుంబమే నిదర్శనం. అతను సారాతోనే సర్వనాశనమై పోయాడు. పైగా సర్కారు మనలను సారా మత్తులో ముంచి మనలను హక్కులకోసం పోరాడకుండా నీరు కారుస్తున్నది. ఈ రోజే చూడండి మన ఊళ్ళో ఎనభై ఎకరాల భూమి రైతు కూలి సంఘం ఆక్రమించింది. పోలీసులు కేసు పెట్టారు. ఇటు భయపడి మనం దున్నుకో లేదు. అటు భూములు వాళ్ళు దున్నుకోలేదు. నడుమ అవి బీడుగానే ఉన్నాయి. మనం ఎంతో ముఖ్యమైన కేసులు, భూముల గురించి మాట్లాడుకోవాలి. అవసరమైతే సాయుధంగానే మనం భూములు దక్కించుకోవాలి. దానికన్నా సార పోరాటం ఇవాళ్ళ రోజంతా తినేసింది. కావున త్రాగుబోతులను, సారాను మనం బహిష్కరించాలి. మత్తును మనం దూరం గొట్టాలి. తయారుచేసేవాళ్ళు, తాగేవాళ్ళు, తాగని వాళ్ళమధ్య కాదు మన పోరాటం.

మత్తుకు వ్యతిరేకం. దాన్ని తెచ్చి పెడుతున్న సర్కారుతోని మన పోరాటం........

ఇక అసలు విషయం. మనం ఎవరెవరి మిగులు భూములు ఆక్రమించామో వాళ్ళంతా దాదాపు తాలూకాలో ఉన్నారు. వాళ్ళు సర్కారుకు భూములమ్ముకొని అట్ల

1103

బెంగాలీ కథ :

# "ప్రాథమిక హక్కులే... హక్కులు"

మహాశ్వేతాదేవి

నవాగర్ చిన్న సంస్థానం. బస్సు పొయ్యే మార్గంలోనే నవాగర్ పొలిమేరల్లో వుందా ప్రాంతం. అక్కడి భూములపై ఆస్తి హక్కు పొందినాయనే, ఆ సంస్థానం 'రాజా' అయ్యారు. రాజాసాబ్ చిరుతప్రాయంలో అంటే వారికి ఏనాది వయసప్పుడు దేశం 'స్వాతంత్ర్యం' సంపాదించుకొంది. అస్థానాలు రద్దయి, జమీందారీ వ్యవస్థ పోయిందన్నాక కూడా, రాజాసాబ్ 'హోదా' అలానే మిగిలిపోయింది. ఇవ్వాల్టికీ ఆయన్ని రాజాసాబ్ అనే పిలుస్తారు. సర్కారువారు అదనపు భూములు స్వాధీనపరుచుకొనేంతలోనే, దాదాపు మిగులు భూమిలో చాలా భాగాన్ని శతకోటి చిల్లర దేవుళ్ళ పేర దఖలు పరిచారు రాజావారు. అది ఆనవాయితీగా వున్న పద్ధతి.

అయినా రాజావారికి దారుణమైన అన్యాయం జరగనే జరిగింది. అక్కడి ప్రభుత్వం పాపపు పనికొడిగట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయి రైలు మార్గం, రహదారుల నిర్మాణాల కోసమని రాజావారి ఆలయ భూములని ఆక్రమించాయి.... ఇదంతా రాజావారు యవ్వన ప్రాంగణంలో అడుగెడుతున్నప్పటి మాటనుకోండి.

---

డబ్బు సంపాయించాలని చూస్తున్నారు. గిరిజన కార్పొరేషన్ హరిజన కార్పొరేషన్ పేర సర్కారు ప్రజలసొమ్ము వాళ్ళకివ్వ జూస్తోంది. మనం భూములను ఆక్రమించుకోవాలి. భూములవాళ్ళ ఆ భూములను సకల హక్కులు మనకు ధారాదత్తం చేయాలి. మన ఊళ్ళకు భూములు కొంటమని సర్కారోదెవడచ్చినా తరిమికొడుదాం........

ఇకనుండి ఎవరైనా ఈ ఊళ్ళో గుడుంబ తయారుచేసినా ఏ షావుకారి బెల్లం తెచ్చి అమ్మినా అక్కలు ఊకుంటరా?" పెద్దన్న........

"ఊకోము....ఊకోము...." అన్నారు స్త్రీలు....

"ఇప్పుడు ఊరేగింపారు. ఆ తరువాత ఇట్లనే చేస్తే ఊరేగింపుడు గాదు. ఊళ్ళనే ఉంచద్దు" భిక్షపతి

అప్పటికి పదకొండు దాటిపోయింది. దళం ప్రయాణానికి సిద్ధమౌతోంది....